

కథ 2008

6

# మాయ

గంటేడ గౌరునాయుడు

“ఎవుల్రా ఈ వేలప్పుడు...”

నిద్రలోంచి బద్ధకంగా లేచి గడపలోకొచ్చి లైటువేసి గ్రిల్స్‌లోంచి చూసేడు... ఇల్లంనాయుడు.

“నేను మామా...” మంచుగాలిలో నల్లదుప్పటి ముసుగేసుకుని చలికి వొణుకుతూ రోడ్డు మీద నిలబడ్డ అతని గొంతును గుర్తుపట్టి, “నువ్వురా... రాజా ఏట్రా... యేటయ్యింది!” అనడిగేడు ఆత్రుతగా. అడిగి తలుపు తీయబోయేడు. తాళం వేసివున్న సంగతి గుర్తుకొచ్చింది. ఇల్లు కొత్త. ఇంటికి తాళం వెయ్యడమూ కొత్త.

మాటల అలికిడికి లేచి తాళం తీసింది ఇల్లం నాయుడి కూతురు.

కార్తీకమాసపు చివరి రోజులు.

దట్టంగా వెలిబూడిదలా రాలుతోంది మంచు.

కొత్త పంచెలసాపు కప్పిన మృతదేహంలా వున్నాడు మంచుతెరల్లో చంద్రుడు.

లైటు వెలుగులో పరకాయించి రాజును గుర్తు పట్టి, “రారా బావు లోపలికి... రోడ్డు మీదే నిలబడి పోయావేమి?” అని పిలిచింది.

“రాడాకి లేదొదినీ... అవతల... సిరంజీవులు మామ లేడా...”

ప్రమాద సంకేతమేదో ఆ గొంతులో స్ఫురించి అదిరిపడ్డారు ఇద్దరూ.

రాజు దగ్గిరగా వచ్చి గుసగుసగా చెప్పేడు. ఒక్క క్షణం నిశ్చేష్టుడయ్యేడు ఇల్లంనాయుడు. అతని మెదడు మొద్దుబారిపోయింది.

‘సాయంత్రం ఎంత బాగా మాట్లాడేడు. ఊరు సంగతుల నుండి కేంద్ర రాజకీయాల దాకా... బయటికి బాగా ఉన్నట్టే కనిపిస్తున్నాడుగానీ... ఆడి మనసును సెదపురుగులాగ దొలుస్తున్న బాధొకటుంది. పెద్ద కూతురు చేసిన పనిని మరిచిపోలేకపోతున్నాడు. వ్యస నాలకి అలవాటుపడిన అన్నలు తన పెళ్లి చెయ్యలేరనే అనుకుందో... పట్నం పోకిరి గాలి మాయలోనే పడిపో యిందోగానీ ఒక ఆటోడ్రైవర్‌ని ప్రేమించానని ఆడితో లేచి పోయింది. అదొక మనోవ్యాధి చిరంజీవులు నాయుడికి...’

టైం చూసేడు. మూడు గంటలు కావస్తోంది.

“పదరా బావ్...” అదురుతూన్న గుండెతో అడుగు బయటపెట్టేడు.

“చలి ఎక్కువుంది గదా... చలిబాడీ తొడుక్కోని యెల్లు. ఇదో ఈ శాలువా కప్పుకోని తలకి మప్లేరు సుట్టుకో,” అని ఇంట్లోంచి తెచ్చిచ్చింది కూతురు.

కొత్తగా వెలిసిన ఊరు.

సున్నం వేసిన కొత్త గోడలతో పొగమంచులో తడుస్తూన్న ఆ చిన్నా పెద్ద ఇళ్ల నడుమ నడుస్తుంటే సమాధుల మధ్య నడుస్తున్నట్టే అనిపించింది ఇల్లం నాయుడికి.

వీధిలో మంటపెట్టి చుట్టూ కూర్చున్నారు కబుర్లాడుతూ కొందరు.

గడపల్లో మంచాల్లోనే ముసుగులు బిగదీసుకుని కొందరు... చిరంజీవులు నాయుడి గుణగణాల గురించి మాట్లాడుకుంటూ, ఆడవాళ్లు వర్ణవర్ణాలు పెట్టి ఏడుస్తున్నారు రాగాలు తీస్తూ. చలిగాలి వారి దుఃఖంలా సుడులు తిరుగుతోందక్కడ.

ప్రశాంతంగా నిద్రపోతున్నట్టే వుంది చిరంజీవులు నాయుడి ముఖం.

అతని తల దగ్గర మట్టిదీపం నిశ్చలంగా వెలుగు తోంది.

ఇల్లంనాయుడికి కుర్చీ చూపించి, 'ఏటిసేస్తాం,' అన్నట్టు చూసేరందరూ.

ఆయా కుటుంబాలవారే కాక ఆ ఊళ్లో అందరూ తమ 'పెద్ద'గా గౌరవిస్తారు ఇల్లంనాయుడిని. కథా కార్యాలప్పుడు, తగవులు తంటాలప్పుడు ఇల్లంనాయుడి సలహా సహకారాల్లో నడుచుకుంటారు.

''అసలేటయ్యిందిరా,'' అడిగేడు చిరంజీవుల్నాయుడి పెద్ద కొడుకు- మోహనరావుని.

''ఆడీ లోకంల వుంటేగదా... ఆడే నా ఇడిమైతే... ఈ పత్రాకులన్నీ ఏల? రాత్రి యేలపొద్దున కసింత తినీసి గడిసేపు భాగవతం తీసి సదివినాడు. కార్తీకమాసం గదా. మనవరాల్ని ఒడిలోన కూకోబెట్టుకోని ఎన్ని కవుర్లు సెప్పినాడనుకున్నావు. అందరమూ ఇలాగ సపోరించినాం. రొండో ఆట సూసుకోని వచ్చాడు పెద్దోడు. వొచ్చినోడు ఎలగొచ్చినాడంతావూ... పుల్లుగున్నాడు. చిట్టితల్లి లెగిసి వడ్డించింది. 'ఇదేం తిండి,' అని దాన్ని కొట్టేడు. కోపమొచ్చి తండ్రేదో అన్నాడు... ఈడు ఎదురు సమాధానం సెప్పినాడు. అంతే. ఏ రాత్రప్పుడు ఈ పని సేసినాడో కానుకుకోలేప్పోనాం. ఇదా... ఈ డబ్బా...'' పురుగుల మందు డబ్బా చూపించి బావురుమన్నాడు చిరంజీవులు నాయుడి తండ్రి. మోకాళ్ల చుట్టూ చేతులు బిగించి ముడుకుల్లో ముఖం దాచుకున్నాడు. ఏడుస్తున్నట్టు అతని ఒళ్లు కంపించడం తెలుస్తూంది.

మంచుతో తడిసిన గాలి ఉండి ఉండి తెరలు తెరలుగా వీస్తోంది.

వీధి చివర చింతోల ముసిల్దాని కోడిపుంజు రెండుసార్లు కూసింది.

''అందరికీ ఫోన్లు చేస్సారు గదా...''

''అప్పజెల్లిలు రాఁవులమ్మకే కవురందలేదు. ఎదురింటోళకి ఫోన్ చేస్తే చెప్తామన్నారు. మియాపూర్ నుండి వచ్చీదాక శవాన్ని ఉంచగలమా...?''

''కష్టమే. అసలే బలవంతపు సావు.''

ఇల్లంనాయుడు చుట్టూ చూసేడు. చూసి, ''ఒరే బావ్. ఈ మాట ఎక్కడా అనకండి. ఒకదానికొకటి,'' అన్నాడు హెచ్చరికగా.

తూరుపు తెల్లబడుతోంది.

ఊళ్లో వాళ్లంతా ఒక్కొక్కరూ చేరుతున్నారు.

దగ్గర దగ్గర ఊళ్ల నుండి వచ్చిన చుట్టాలు జనాలతో వీధి... ఇళ్ల గడపలూ నిండుతున్నాయి. జనం లోంచి అన్నారెవరో...

''కాష్టంకి కర్రలు కొట్టడానికి... మేళాంకి... సాకలి... మంగళ్లకి కవురెట్టండి.''

గతుక్కుమన్నాడు ఇల్లంనాయుడు.

*

''బావూ... మీకు కోపమొత్తే నాను సెప్పలేను. మీరు పెద్దోలు. మా నౌకరోల మాట సెల్లదు. అయితేటి... ఇరుకుజూసి సురకబెడతన్నార్రా ఈడూ అని మీరనుకోప్పోతే నాదొక మనివి,'' అని తల గోక్కున్నాడు- అప్పోజి.

''ఏట్రా...'' విసుగ్గా చూసేడు ఇల్లంనాయుడు.

అందరూ అప్పోజినే చూస్తున్నారు అసహనంగా.

''బావూ- ఇప్పుడు నానేటి సెయ్యగల్ను. మీ పార్టీల తగువుల్తోటి నా కొడుకుని పనికి రావొద్దనీసి సిచ్చ సెప్పీసినారు. ఆడెంత ఇంసపడ్డాడో మీరెరగరు. ఆ బాధతోటే వూరొగ్గీసినాడు. ముంపు పేకేజి డబ్బులు వొచ్చినాయి. పట్నంల సెలూన్‌బడ్డీ ఎట్టుకున్నాడు. ఇక నా మాటంతారా... కూకుంతే నెగలేను... నెగిత్తే కూకోలేను. అడుగుతీసి అడుగెయ్యలేను. నానేటి సెయ్యగల్ను ఊరి నౌకరి,'' దగ్గు, ఆయాసం మధ్య తన అశక్తతను, ఆక్రోశాన్ని వెళ్లగక్కేడు అప్పోజి.

''...ఇంతకీ నువ్వన్నిదేట్రా...'' ఎవరో కోపంగా అరిచేరు.

''ఇంకేట్రా ఆడు అంత సొష్టంగ సెప్తుంతే...''

''ఒరే పిల్లి గుడ్డిదైతే ఎలక అదేటో సూపించిందట... మన లోకువ కనిపెట్టినారు... ఆలిష్టమొచ్చినట్టు ఆళ్లాడతన్నారు. మన తడాకా యేంటో సూపెడితే...'' మీది కొచ్చేడు ప్రెసిడెంటు తమ్ముడు.

''ఈడొకడు... కిందామీదా సూడడు. అన్నిటికీ కలబడిపోడమే... అందరికి తెద్దుమా కొందరికి తెద్దుమా అనీ... ఎల్లా...'' కసిరేడు ఇల్లంనాయుడు.

''బావుల్లారా... మీ సాకిరి సేసి బతికినోలిమి. మీరు మరొకలాగ అనుకుంతే నాను సెప్పలేనుగానీ పాలిచ్చిన ఆవుని తగిలీసి కొమ్ములిసిరిన ఎద్దుని తెచ్చుకున్నాట్ట... మా వోడిని గెంటీసి ముక్కు మొకం తెలీనోడ్ని పనికి తెచ్చుకున్నారు. మీ తాతల తండ్రులప్పుడు- కాసి సేవజేసినోలుమనైనా ఆలోసించలేదు. 'సాకలి కొత్త మంగలి పాత' అంతారు. అదయినా తెలుసుకోకుంట ప్రవర్తిల్లినారు. ఆకరికి యేటయ్యిందీ... ఆ వొచ్చినోడు అందినకాడికి అప్పులు జేస్సి పరారైపోతే... ఇప్పుడు గింజుకుంతండ్రు... కాలూ సెయ్యి లేనోళ మీద కలబడిపోతే తిరిగి మామేటి సెయ్యగలమా- సెందగలమా... అదిగో మారాజుకొడుకు బట్టంతే... పాతంతే... తిండికి

లేన్నాడు బత్తిమంతే జరిపివోడు. కడసారి మొకము సూద్దమని నడ్డీడుసుకోని వచ్చినాను. యేలినవోరి దయ. సంపిత్తే సంపీయండి,'' అని రెండు చేతులూ ఎత్తి దండం పెట్టేడు అప్పాజి.

ఇల్లంనాయుడు ఏమీ అనలేకపోయాడు.

అప్పాజి దేక్కుంటూ అక్కడి నుండి కదిలేడు.

రెండు జాముల పొద్దెక్కింది.

రావలసినోలంతా వచ్చేరు... వలసెళ్లిపోయిన వారిలో రావలసిన వొకరిద్దరు తప్ప.

''అయితేటి సేత్తామర్రా... శవం ముందల కుంపటి పట్టుకోవలసినోడు... మేళం కట్టవలసినోడు ఎవలూ లేకుంట ఎలగ తీసికెల్తాం,'' విసిగిపోతున్నాడు ప్రెసిడెంటు తమ్ముడు.

''ఏందర్రా ఇంక అంబల్లేలయిపోతంది. రావలసినోలందరూ ఎలిపొచ్చినారు. అవతల తిళ్ల తిప్పలు లేకుంట ఎంచేపుంతారు? కడుపులో వున్నోళ్లకు పచ్చి గంగయినా ముట్టరు పీనుగెల్లిందాకా... లెండర్రా లేగి...'' తొందరచేసేడు నడిమింటి కాశినాయుడు.

''ఒరే... నువ్వుంర్రా ఈకూ తెలీదు సీకూ తెలీదు. రెండూ తెలీదూ రాముడు కత. పెద్దోలు ఏదో ఆలో సించుతన్నారు గదా,'' అని కాశినాయుణ్ని కసిరి జేబు లోంచి కింగ్‌సైజు ఫిల్టర్ సిగరెట్ పేకెట్ తీసి వెలిగించాడు మంతిని సిమ్మడు.

''ఏటివోయ్ బావా... సీను మారింది. కరీం బీడీ కట్ట నుంచి ఫిల్టర్ కింగ్‌కి పెరిగిపోయింది లెవిలు. మీపనే బాగుందివోయ్. ప్రాజెక్టు ధర్మాన కళ్లుగానని సొమ్ము. ఇంటికి స్థలమూ... అదీ పట్నం దగ్గర. ఇల్లు కట్టుకోడాకీ... మడిసెక్కలకీ... లచ్చల మీద సొమ్ము. మా ఊరూ అలగ మునిగిపోతే బాగున్ను... అవునోయ్... యేటి సేస్తారువోయ్ ఆ సొమ్మంతా... అదృష్టమంతే మీదేనివోయ్...'' పొరుగూరు నుంచి వచ్చిన చుట్ట మొకడు హాస్యమాడేడు.

''ఆ...ఆ... అదృష్టమంతే అంతా ఇంతే. ఇంటికి జాగాలిచ్చి నలభై వేలు తోటి ఇళ్లు కట్టుకోవాలన్నారు. దాంతోటి ఇల్లు అయిపొద్దేటి? మడిసెక్కలకి ఇచ్చిన సొమ్ము ఇళ్ల మీద పెట్టేసినాం. గోవుపాదమంత జాగా లేదిప్పుడు యవసాయం సేద్దుమంతే. కొందరయితే సొమ్ము సేతల పడింది లగాయితూ... జల్సాలు సాయంత్రమయ్యానరికి ఇస్త్రీబట్టలు ధరించిసి పట్నంల సికార్లు. ఈ బీర్లు, బిరియానీలు వొకటేటి, ఉన్న కాడికి తగలబెట్టెస్తంర్డి. ఈ సంవత్సరంకి తిండి గింజలున్నాయి. కూకోని తింతన్నాం. దినం దీరిపోతంది. ఇప్పుడు తెలీదు. వొచ్చీ ఏడాదికి తెలుస్తాది. బండీ బక్కా అమ్ముకోని ఎలిపొచ్చినాం. యవసాయం లేదు. పనీపాటు లేకుంట తిరగడం తోటి బద్ధకం బలిసిపోయి మరొక పనిసెయ్యడాకి వొళ్లంగదు. అప్పుడు బోధ పడతాది అదృష్టమేదో...''

ఆ మాటకి అందరూ మౌనంగా ఉండిపోయేరు కొంతసేపు. అందరిలోనూ ఏదో బాధ ముల్లులా గుచ్చుతోంది.

''ఈ ప్రాజెక్టు వల్ల మనకి సుకం లేదురా... అని నెత్తి గొట్టుకోని చెప్పాను. నా మాట ఎవులూ పట్టించుకోలేదు. బొమ్మళ్లందిన కుండమీద ఎన్ని బకెట్లు నీళ్లు పోత్తే మాత్రం యేట్లాబం? లచ్చల సొమ్ము ఎప్పుడు కళ్ల జూస్తాము. పట్నం దగ్గిర సోటు మనం ఎప్పుడైనా కొనగలమేటి అని సెంకలెగరేసినాం. పోనీ అందిన సొమ్ముతోటి మరొక్కాడ మడిసెక్కలు కొనగలిగినామా... లేదు. ఒక ఊరు రెండూళ్లయింది. పార్టీ తగువుల్తోటి సాకళ్లని, మంగళ్లని వొదిలీసినాం. గుడ్డముక్కంతే సబ్బెట్టి గుంజుకుంతాం. గెడ్డాలంతే రేజరుతోటి సేసుకుంతాం. సమర్తలంతే... సావులంతే... అవెలాగవుతాయి. ఎంతకి పట్నం గాలి తగిలినా ఆచారాలు... సాంప్రదాయాలు అవెలాగ వొదులుకోగలం...''

తన మాట కాదన్నందుకు ఫలితం అనుభవిస్తున్నాం సుమా అన్న భావం వ్యక్తం చేసేడు బబ్బాది గోపినాయుడు.

''నిజమే. ఎవులమూ అంత దూరం ఆలోసించలేదు. అయినా... తర్నం తెలీనిచ్చి నారేటి ఆపీసర్లు. జీపీల్తోటి ఎలిపోరాడం... మీటింగులని గాబరా పెట్టీడిం...'' వొప్పుకున్నాడు ప్రెసిడెంటు.

ఎవరో 'టీ' తెచ్చారు పళ్లెంలో గ్లాసులు పెట్టి.

అందరూ తీసుకున్నారు.

వీధిలో ఎండ పడుతోంది. వొళ్లు వెచ్చబడుతోంది. కప్పుకున్న దుప్పట్లు, తొడుక్కున్న స్వెట్టర్లు తీసి పక్కన పెడుతున్నారు కొందరు. సిమ్మెంటు రోడ్డు మీద జనం అక్కడక్కడ గుంపులు గుంపులుగా రకరకాల చర్చల్లో.

పక్క గ్రామం నుండి వచ్చిన ఎవరో అన్నారు.

''ఈ స్లేబిళ్లూ... సిమ్మెంటు రోడ్లు అన్నీ బాగున్నాయిగానీ నాకయితే ఇది ఊరు లాగ కనబడలేదు సుమీ...''

అందరూ అతనివేపు ఆశ్చర్యంగా చూసేరు.

''ఊరంతే... అయిదారు వీధులు... వీధికి నలభయ్యో యాభయ్యో స్లేబిళ్లూ వుంతే సరా... ? ఊరంతే ఎలాగుండాల... అందలోనా రైతులున్న ఊరు.

ఇల్లు... ఇంటి ముందు ధాన్యపు గాది. గాదెనక పశువుల సాల. సాలలోన పశువులు. సేనికుప్పలు ఏసుకోడానికి కళ్లం. కళ్లం పక్క గత్తానికి పెంటకుప్ప ఉండాలా? ఊరు మద్దిని రామ్మందిరం, ఊరవతల అసిరమ్మగుడి, ఇవేవి ఇక్కడ? ఇక నౌకరోలు, సాకలి... మంగలి... కుమ్మరి... కమ్మరి... దేవాంగులు... ఎరకలి... అందరూ ఉంతేనే గదా అది ఊరు. వొదిలీసి ఎలిపొచ్చినారుగానీ ఊరంతే అదే... నాలుగు పక్కల తోటలు... సుట్టూ పెండి... సెట్టూ సేమల తోటి పంట పొలాల్తోటి ఏటిపక్క ఎంత గొప్పగా ఉండీది," గుర్తు చేసుకున్నాడు.

"నిజఁవే... ఆ కొత్తపేట ఎల్లి ఆడిని ఈడిని బతిమాలి ఆళ్ల కళ్లాలంట సేని కుప్పలు ఏసుకోవలిసొచ్చింది. ఆలెప్పుడు తీసిమంతే అప్పుడు తీసియ్యాల. ఇంత నిరబందనొచ్చింది," ఒకడు బాధపడిపోయేడు.

"పట్నం దగ్గరయితే పిల్లల సదువులకీ... అవసరాలకీ... యాపారాలకీ... యవ్వారాలకీ అన్నిటికీ బాగుంతాదనుకున్నాంగానీ ఇలగని ఎవులు కలగంతారు సెప్మీ..." ఒక రైతు వేదన.

"అవుసరంకి దగ్గిర... వ్యసనంకి దూరము అన్నట్టుండాల. పట్నం కాపరం అంట పట్నంకి అల్లంత దూరంలోన పల్లెటూరి కాపరమే మంచిది సుమా..." సూత్రీకరించేడు బబ్బాది గోపినాయుడు.

"నిజఁవే సిరంజీవులు దద్ద ఎప్పుడూ ఇదే అనీవోడు. మనలాటోళ్లం పట్నంల బతకలేంరా అని. ఏదైనా పని మీద పట్నమెల్లవలసొచ్చినా ఎంత బేగి మనూరు యెలి పోదుమా అని సూసీవోడు. సినీమాకి ఎల్దుము దద్దా, అంతే వొప్పీవోడు కాదు. ఊరు ఖాళీ సేసిన్నాడయితే... పాలు తాగిన కుడుబ్బెయ్యిని పొదుగు నుండి లాగితే ఎలాగ గింజుకుంతాదో అట్టి సందాయింగే... గిలగిలలాడిపోనాడు. ఊరుదాటి వొచ్చినాడు. మన సొగ్గీసినాడు. దానికి తోడు స్థిరంలేని కొడుకులు. ఆళకి మరొక పనిలేదు. పొలాన పంటయేటయ్యిందో అక్కర్లేదు. పాపం ఇతగాడే సీకటి తోటి బస్సెక్కెల్లి పొలం కాసి సూసుకోని ఏ అంబల్లేలప్పుడో వొచ్చేవాడు. ప్చ్... కొడుకులు అలగ... కూతురిలగ... అది భరించలేకే... తెంపరించీసినాడు..."

"పల్లకో... గట్టి గనకు..."

"... ఇంకేటి ఆలిసం? ఏల మించిపోతంది గదా..."

గుర్తుచేస్తున్నాడు మాటిమాటికీ వైస్ ప్రెసిడెంటు.

"ఔనుగానీ పీనుగుని ఎక్కడ దహనపరుస్తారు? మీ ఊరు వల్లకాడుకి జాగా ఎక్కడ సూపెట్టింది గవరమెంటు?" ఎవరో ధర్మసందేహం వ్యక్తం చేసేరు.

ఔన్నిజఁవే... ఎక్కడ? ఈ సంగతే ఆలోసించలేదు... ఊరు ముంపుకి గురవుతుందన్నప్పుడు అందరూ ఊరికి జాగా ఎక్కడిస్తారు? ఇంటికెంత భూములకు రేటెలాగ? ఇదే ఆలోచించారుగాని ఊరుమ్మడి జాగాల గురించి ఎవులికీ లేక పోయింది. అందరిలోనూ స్మశానం జాగా గురించిన ఆలోచన అప్పుడు మెదిలింది.

"దద్దా... ఆ సాకలగుంపడు కాష్టం పేర్సడాకి రానని కరాకండీగ సెప్పీసినాడు. 'నా అవుసరంకి ఊరు లేప్పోతే ఊరు అవసరంకి నానెందుకుండాల,' అని నిర్మొగమాటంగ అనీసినాడు. ఆడికి అక్కడే రెండు తగల్నిద్దునుగానీ మరేల... ఇది సమయంగాదు. అయినా ఆడెందుకొత్తాడు సేతినిండ సొమ్ము, సొంత లేండ్రీ షాపు పట్నంల. ఆడింక లొంగుతాడు మనకి. అప్పుడే లిస్టులోన ఆడి ఇల్లు రాయడం మానిత్తే అప్పుడు తెలిసుండీది. మరేల...?" చాకలి గుంపడు రాడన్న సంగతి తేల్చేసేడు గుంపడిని పిలవడాకి వెళ్లిన రాములు పెద్దపెద్ద కేకలు వేస్తూ.

"ఔనర్రా... ఆడు రాడు. అయితేటి పీనుగుని ఇలగుంచేత్తామేటి? పదండి మనమే ఆ పని సేసిద్దుంగాని. ఆశారమే... అయితేటి ఇప్పుడెలగవుద్ది పదండి," అని గొడ్డలి తెచ్చేడు సన్యాసినాయుడు. కొందరు కుర్రాళ్లు భుజాన కర్రలు మోసుకుని పట్నంకి ఆనుకుని ఉన్న కొత్తపేట స్మశానంకేసి వెళ్లేరు.

రోడ్డు మీద నులక మంచం వేసి శవస్నానానికి కుండలతో నీళ్లు, పసుపు కుంకుమ... అక్షితలు సిద్ధం చేసేరు ఆడవాళ్లు.

చిరంజీవుల్నాయుడి మేనత్త కొడుకు గున్నయ్య కుంపటి పట్టుకోడానికి తయారయ్యేడు.

పాడె ఎత్తుతుండగా పరుగు పరుగున వచ్చేరు కుర్రాళ్లు.

ఒకడన్నాడు-

"అక్కడ దహనపరచడానికి ఎంతమాత్రమూ వొల్లగాదట. ఆ కొత్తపేటలో వొప్పుకోలేదు. మీ వూరోలు మరొక్కాడ వల్లకాడు సూసుకోండి ఇక్కడ పనికిరాదు అనీసినారు. ఎంత బతిమాలినాం గానీ కాదనీసినారు."

ఎత్తిన పాడె దించీసేరు.

అందరూ గొల్లుమన్నారు.

ఏం చేద్దామన్నట్టు అంతా ప్రెసిడెంటు వేపు చూసేరు.

ప్రెసిడెంటు ఇల్లంనాయుడి వేపు చూసేడు.

ఇల్లంనాయుడు కొంచెంసేపు ఆలోచించి చెప్పేడు.

''మన పాత ఊరికి తీసికెలిపోడం తప్ప మరొకదారి లేదు.''

... ... ... ... ...

ఎవ్వరూ మాట్లాడలేదు.

''...అదీ వొకందుకు మంచికే... తమ్ముడు ఎప్పుడూ అనీవోడు, 'పుట్టిన మట్టి మీద బుగ్గయి పోడమూ ఒక అద్రుష్టమే కదా...' అని. నాలుగు రోజుల కిందట ఆడన్నమాట తలుసుకుంతే కడుపుల దేవెత్తం దనుకో. 'అన్నా... ఆ ఊరు సూత్తే ఇళ్లు తిరగబడిపోయి మొండిగోడలతోటి వల్లకాడు- దిబ్బయిపోయి నక్కలు దుమ్ములగొండులు తిరుగుతిన్నాయిరా... గుర్తుకొస్తే తిండి సయించడం లేదురా,' అని... ఎంతో బాధ పడ్డాడు. ఆడికి ఆ మట్టి మీద మమకారం పోలేదు. ఆ ఏటొడ్డు, ఏపసెట్టు ఆడి నేస్తాలు. మరందుకే అక్కడికే తీసికెల్లి దహనపరిచిద్దుంగాని. దూరమే... అయినా తప్పదు.''

ఎండ... ఆకలి... జనంలో అసహనం.

''...ఇంకేటట్రా ఆలోసించుతారు. అంబళ్లేల దాటితే మళ్లీ సాయంత్రందాక అవ్వదు. అందలోన మామూలు సావుగాదు. ఎంత బేగి ఊరు దాటించిత్తే అంత మంచిది.''

తొందర పెడుతున్నారు కొందరు.

ప్రెసిడెంటు ఎవరికో ఫోన్ చేసేడు ట్రాక్టరు కోసం.

శవవాహకులు సిద్ధమయ్యేరు.

''మేళం లేకపోతే లేదు. భజనయినా సెయ్యండ్రా.''

గుర్తు చేసేరెవరో. భజన సమాజం కుర్రాళ్లు డోలక్కు... తాళాలు తీసేరు.

''ఎవుల్ని పల్లెత్తుమాట అనడం ఎరగడు.''

''బీదా బిక్కీ అంతే ఎంత దయో...''

''అన్యేయమంతే వొప్పోడు గాదు.''

''కాస్త బొరిగి భుజానేసుకోని మడిగట్టు మీద రాగం తీసుకోని నడుత్తుంతే...''

''హరిశ్చంద్రుడి వేషం కట్టి స్టేజీ ఎక్కితే సూపులు సూడాల. కాటిసీను పజ్యాలు పాడితే కళ్లంట నీరు తిప్ప నోడు లేడు.''

''ఎటువంటోడైతే ఏటి... ఈనాటికీ కర మొచ్చింది. కొడుకులు దిప్పరగొట్టోలయి పోయి వ్యసనాలు నేర్సి, అందినకాడికి సొమ్ము ఆరిపేసినారు. కూతురా అలగ జేసింది. ఎవల్ని సూసుకోని బతకాలని అనుకున్నాడు గావాల...''

చిరంజీవులు నాయుడి మంచితనం గురించి ముచ్చటించుకుంటున్నారు.

కుంపటితో శవం ముందు నడిచేడు గున్నయ్య.

''ఏమి అనాశారంరా మంగలిపనీ సాకలిపనీ అన్నీ మనమే సేసుకోవలసి వచ్చింది గదా,'' వాపోయాడు దివిటీ పట్టుకున్న సన్యాసయ్య.

మనవడు ముందలితనాలు జల్లుతుండగా పాడె రోడ్డును సమీపించింది. దాపుడు కళ్లం ఆశ తెంపుకుని నారాయణ నారాయణ నారాయణ అని మూడుసార్లు భగవన్నామస్మరణ చేసి శవాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కించారు. పాతిక ముప్పయి మంది దాకా బండిలో ఎక్కేరు. ఇల్లంనాయుడిని డ్రైవరు పక్క కూర్చోబెట్టేరు.

పొద్దు నడినెత్తికొచ్చింది.

ట్రాక్టరు కదిలింది.

అప్పుడొచ్చింది చిరంజీవుల్నాయుడి అప్ప జెల్లిలు... నోటికి పయ్యాడకొంగు అడ్డం పెట్టుకుని కుమిలికుమిలి ఏడుస్తూ...

'పొన్నే... కడసారి అన్నమొకం సూడ్డానికి అందింది...' అనుకున్నారు. గుండెలు బాదుకుంటూ యేడుస్తున్న ఆడోళ్లను బలవంతంగా వెనక్కి పంపించి ట్రాక్టరు ఎక్కేడు చిరంజీవుల్నాడి వీరకాడు సింహాచలం నాయుడు.

ఇల్లంనాయుడికి అంతా కలలోలాగా ఉంది.

చిరంజీవులు నాయుడు మరణించాడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా డతను. క్రితం రాత్రి దాకా తనతో కబుర్లాడినవాడు, ఏ చిన్న పనైనా తనకు చెప్పిగాని చేయనివాడు, అన్నా అని ఆప్యాయంగా పిలిచినవాడు.

'చిరంజీవులునాయుడు బావ్ రాగం తీసి పురాణం సదివితే ఇల్లంనాయుడు బావ్ అర్థం సెప్పాల...' అని ఊరంతా గొప్పగా చెప్పుకోడం గుర్తుకొచ్చి అతని కళ్లు నీటితో నిండిపోయేయి. అటువంటి చిరంజీవుల్నాయుడి శవయాత్రకి చావుమేళం లేదు. కాష్టం పేర్చడానికి చాకలి లేడు, వల్లకాడూ లేనట్టయ్యింది.

ఇలాంటి చిత్రమైన స్థితి మొదటిసారి చూస్తున్నాడు ఇల్లంనాయుడు.

వందల ఏళ్లుగా పేమిన వర్ణవర్ణాల దారాల బలమైన తాడు పాటికిపోయి పుటుక్కున తెగిపోయి నట్టయ్యింది.

బండి కదిలింది.

'ఏమన్నేయంరా... తండ్రీ నారాయణమూర్తీ... ఎటువంటి మనిషికి ఇటువంటి కష్టమొచ్చిందీ. ఊరు

ములిగిపోద్దీ అన్నారు. గుండె ఎండబెట్టుకున్నాడు. పుట్టి బుద్ధెరిగింది లగాయితూ మారాజు తండ్రి ఊరు దాటి ఎరగడు. బొత్తిగా సత్తిగాలపోడు. బతికిన బతుకంతా ఆ ఏటొడ్డునే. తెల్లారి ఏటికాసెల్లి ఏటొడ్డు ఏపసెట్టు రెమ్మ ఇరిసి మూడికిలు నఁవిలి పొలంపని సూసుకోని ఏటిల స్నానంజేసి వచ్చీవోడు. కష్టమైనా సుకమైనా ఏపసెట్టుతోటీ... ఆ యేటితోటీ సెప్పుకోని గుండె బరువు దింపుకొనీవోడు. ఊరు ఖాళీ చెయ్యమన్నప్పుడు చిన్నపిల్లడిలాగ కళ్లంట నీరు తిప్పుకున్నాడు. ఇంటికీ... పొలలకీ రేటు కట్టినపుడు ఆడి మొకం సూత్తే భయమేసింది... పొలమంతే గవర్మెంటుకది ఖరీదు కట్టే స్థలమే కావొచ్చుగాక... అన్నా పొలమంటే రైతు ఒళ్లే గదరా. నా ఒంటికి ఖరీదు కడతారా? నా బతుక్కి రేటు కడతారా? అని ఎంత కుమిలిపోయాడో. అప్పుడు కాసి మనసొదిలీసినాడు. ఊరు మారింది. ఇల్లు మారింది. మనుషుల తీరు తిత్తవ మారింది. ఇళ్లలోకి రంగుల టీవీ లొచ్చాయి. ఎడ్లూ... బళ్లూ ఎలిపోయి మోటారుబళ్లొచ్చాయి. పొలం పనులు లేవు... పట్నం షికార్లొచ్చాయి... బీర్లు బిరియానీలు వొచ్చాయి... సోకులు... సరదాలు... విందూ వినోదాలు ఒకటేటి... రారానివన్నీ వొచ్చాయి... ఇవన్నీ చూసినాడు. మనిషి పితలాయించీసినాడు. కూతురు తీసుకున్న నిర్ణయంతో మరింత కుంగిపోయాడు. బండీ బక్కా లేనోడు... పొలము పుట్రా లేనోడు పకీరోడవుతాడుగాని రైతెలాగవుతాడు అని కృశించిపోయేడు... ఔను ఇప్పుడెవులుమూ రైతులం కాము... అందరమూ... పకీరోళ్లమే... పంటభూమికి పరాయోళ్లమే.'

ఇల్లంనాయుడి గుండె బరువెక్కిపోయింది. దెబ్బ తగిలినచోట చర్మం తిమ్మిరెక్కి కొంత సేపయ్యాకే గాయం నొప్పి వంటికి తెలిసొచ్చినట్టు ఊరిని వదిలి వచ్చాక ఈనాటికి ఇప్పుడు బాధ అనుభవంలోకి వస్తోంది.

"ఇల్లంనాయుడు మామా ఊరొచ్చింది," ఎవరో పిలవగా ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

చూసేడు ఊరు ఖాళీ చేసేక మళ్లీ ఇదే రావడం.

అతని గుండె కలుక్కుమంది.

కూలిన మిద్దెలు, విరిగిన అరుగులు... పెచ్చలూడిన గచ్చులు... మొండిగోడలు... మట్టిదిబ్బలు. యుద్ధానంతర శిథిల నగరాన్ని చూస్తున్న యోధుడిలా నిశ్చేష్టుడై పోయాడు. జరిగిన యుద్ధాల గురించీ... పత్రికల్లో చదివాడు. ఎందరో చెప్పగా విన్నాడు. కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నట్టుంది. 'యుద్ధం లేదు... బాంబులు లేవు. ఊళ్లు మాత్రం వల్లకాటి దిబ్బలవుతున్నాయి. మనుషులమా... నడపీనుగుల్లాగున్నాం. ఎందుకిలాగ? ఎవులు చేస్తున్నదిది? ఎవరి ప్రయోజనం కోసం?' ఇల్లంనాయుడి బుర్రలో ఎన్నెన్నో ప్రశ్నలు.

గెద్ద ఒకటి అతని తలమీదుగా ఎగిరి ఓ ఇంటి మొండి గోడ మీద వాలింది.

బండి దిగి వీధిలో అడుగుపెట్టేడు.

మొండిగోడల మీద జేరిన కాకుల గుంపు మనిషి అలికిడికి ఎగిరి చెట్ల మీదికి చేరాయి.

'పెద్దలు పేరంటోళ్లు శిథిల గ్రామాన్ని చూడాలని వచ్చాయి గావాల,' అనుకున్నాడు.

రామమందిరం మెట్లు మీద నుంచి ఏదో పాము నెమ్మదిగా లోపలికి పాకుతోంది మెలికలు తిరుగుతూ.

నాయుడోళ్ల వీధిలోంచి సందులు తిరిగి చిరంజీవులు నాయుడింటి గడపలో అడుగుపెట్టేడు. నక్కలు రెండు ఇంట్లోంచి బయటకు పరుగు తీసేయి.

ఈ గడపలోనే గదా తమ్ముడు పురాణం చదివితే నేను అర్థం చెప్పింది. పురాణం వినడాకి వొచ్చినోళ్లు ఈ అరుగుల మీదనే గదా కూర్చుండీవోళ్లు.

అరుగు మీద నిలబడి చూస్తే దూరంగా వెదురు వేపచెట్ల సందుల్లోంచి నిదానంగా ప్రవహిస్తో... ఓ అనాథలా కనిపించింది నాగావళి.

గాలి తెర విసిరికొట్టింది.

కళ్లలో ధూళి పడి కళ్లు కరకరలాడేయి.

ఇళ్ల పెరళ్లలోని కొబ్బరిచెట్లు గాలికి ఊగే రెమ్మలతో దెయ్యాల్లా కనిపించేయి. ఒక్కక్షణం ఒళ్లు జలదరించింది.

ఎత్తైన ఆ అరుగుమీద నిలబడి చుట్టూ చూసేడు.

ఎన్ని వందల ఏళ్లయ్యిందో ఈ ఊరిక్కడ వెలిసి.

ఎన్ని పండుగలో... ఎన్ని సందడులో... ఎన్ని వసంతాలో... ఎన్ని పున్నములో... ఎన్నెన్ని పంటలు... ఎన్నెన్ని భాగ్యాలు... ఎన్ని కళ్యాణాలెన్ని కాపురాలెన్ని సౌభాగ్యాలు... ఎన్ని బంధాలు... ఎన్నెన్ని అనుబంధాలు... ఆటలు... పాటలు... అసిరమ్మ పండుగల వాలకాలు... కళ్లు తిరిగినట్టయి అరుగు మీద నెమ్మదిగా చేరబడ్డాడు. ఆ అరుగు మీద కూర్చుని చిరంజీవులునాయుడు ఎప్పుడూ ఇష్టంగా పాడే పద్యం... కరుణ- రసార్ద్రంగా చెవిని సోకినట్లయ్యింది.

*మాయామేయ జగంబె నిత్యమని సంభావించి మోహంబునన్...*

ఔను... మాయామేయ జగమే. ఎక్కడ చూసినా మాయే. మాయలేని సోటు లేదు. మాయ కాప్పోతే ఇదేటి? ఎవులో ఎవలి కోసమో చేస్తున్న మాయే. బలై పోయింది మాత్రం మేము. ఎక్కడో మొదలైన మాయ ఇక్కడ మా బతుకుల్ని ముంచీసింది. మనిషిని మనిషి లాగే ఉంచి గుండికాయని తీసేసిన మాయ. మరి మాయగాదా, పేకేజీలు... పరిహారాలు అని కళ్ల ముందు మాయ మెరుపులు మెరిపించి ఇళ్లూ మళ్లే గాదు ఊళ్లకు ఊళ్లే మాయజేస్తున్న మాయగాళ్లెవులో... అళ్లనీ ఆడిస్తున్న మహామాయగాళ్లింకెవులో ఏటో. ఈ మాయకి మొదులెక్కడో... ఈ మాయ సాగర మథనంలోన విషం మా యదానకొట్టి అమృతము... ఐరావతము... కామ ధేనువు... కల్పవృక్షము అవతల ఎవళకి సమర్పించు కోడానికో? ఆ మాయదేవత లెవులో మరి...

పురాణాల నుండి చరిత్రను దాటి వర్తమానం దాకా అదే 'మాయ' కొనసాగు తుంది కదా అనిపించింది ఇల్లంనాయుడికి. మారింది కాలమేగాని మాయలో మార్పు లేదనిపించింది. అతని పెదాల మీద వాడిన పువ్వులాంటి నవ్వొకటి జారి గాలిలో కలిసి పోయింది.

"బావా... అవతల పొద్దుగుంకి పోతంది గదా..." వీరకాడు పిలిచేడు.

'ఔను గదా... పొద్దు గుంకిపోతంది గదా... నిజఁవే గదా,' అనుకుంటూ భారంగా అడుగులేస్తూ వొచ్చేడు బండి దగ్గరికి.

గుండెల్లో దుఃఖం సుడులు తిరగ్గా ఎవరో అంటున్నారు.

"సూడంబ్రా బావ్ మన వూరు శుంగారము... వైభోగము... ఎప్పుడో ఎవులో శాపం పెట్టీసినారు గావాల."

బండి కదిలింది వల్లకాడు వేపు.

ఇది నా ఊరేనా... ఇది నే నడిచిన దారేనా...

తల్లి నా పల్లె తీరే మారెను... చూసే కన్నులు చెమ్మగిల్లెను...

నిర్వాసితుల సభలో రామినాయుడు పాడిన పాట బండి వెనకే వొస్తున్నట్టుంది... వెంటాడుతున్న ట్టుంది.

చితి ఏర్పాట్లలో పడ్డారు కొందరు. నాగావళి ఒడ్డున చిరంజీవులునాయుడి మడిలోనే కూర్చున్నారు మిగతావాళ్లు దిగాలుగా.

"... ముంపు భూములకి తగిన రేటు కోసం ధర్నాలు చేసి లాఠీదెబ్బలు తింటే గానీ పని జరగలేదు... ఇప్పుడు 'మా ఊరికి వల్లకాడు కావాల' అని మళ్లీ ధర్నా చెయ్యాల గావాల. మా ఊరికి రోడ్డు కావాలనో... బస్సు కావాలనో... ఆసుపత్రి కావాలనో అడుగుతారు ఎవ రైనా... కానీ, 'మాకో వల్లకాడు కావాల'ని అడుగుతున్న వాళ్లం చరిత్రలో మనమే మొదటోళ్లం గావాల," స్మశాన వాటిక కోసం ధర్నా ఆలోచన బయటపెట్టాడో యువకుడు.

"ఈసారి ధర్నాలోన ఎవలెవలికి ఏటేటి ఇరుగు తాయో సూడాల..." గతంలో ధర్నా చేసినపుడు జరిగిన లాఠీఛార్జిలో విరిగిన మోకాలును తడుముకుంటూ అన్నాడో కుర్రాడు నవ్వుతూ.

పొద్దు పడమటి తాటిచెట్ల గుబురుల్లోకి జారు తోంది.

ట్రిటీటివ్... ట్రిటీటివ్... ట్రిటీటివ్...

గాల్లో గిరికీలుకొడుతూ ఎగురుతోంది తీత్రివ్వ.

సందె వెలుగులు ప్రతిఫలించి యుగయుగా లుగా ఎందరో ముత్తైదువుల పసుపు కుంకుమలు కడిగి తనలో కలుపుకున్న అపరాధభావనతోనో ఏమో ఎరుపు పసుపు రంగులు కలగలిసిన చిత్రవర్ణంలో జాలిజాలిగా ప్రవహిస్తోంది నాగావళి.

చితికి నిప్పంటించడానికి ఏర్పాట్లు పూర్త య్యేయి.

చిరంజీవులునాయుడి పెద్దకొడుకు భుజాన నీళ్ల కుండతో చితి చుట్టూ ప్రదక్షిణం చేసేడు మూడుసార్లు.

మూడు నీళ్ల ధారల కోసం గొడ్డలి మొనతో మట్టి కుండకు మూడు గంట్లు పెట్టేడు గున్నయ్య. శవం మీది కొత్తబట్ట సగానికి గొడ్డలి అంచుతో చించి దాన్ని శవం మీద కప్పేడు.

'ఎవరున్నా లేకున్నా ఎవరికోసము ఏదీ ఆగదు కదా... అనుకున్నట్టే తాను పుట్టిన మట్టి మీదే పిడికిడు బుగ్గి అయి పోతున్నాడు తమ్ముడు.'

ఇల్లంనాయుడి కళ్లలో పల్చని నీటితెర.

*ఆదివారం వార్త, 23 మార్చి 2008*

